ప్రజాశక్తి
సోమవారం 28 జూలై 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

విశాల ఐక్య పోరాటాలు

మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

- మతోన్మాద, కార్పొరేట్ శక్తుల దాడిని కార్మికోద్యమాలతో తిప్పికొడదాం
- విశాఖ ఉక్కును కాపాడుకుందాం
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు
- ముగిసిన విశాఖ జిల్లా 13వ మహాసభ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

దేశంలో మతోన్మాద, కార్పొరేట్ శక్తుల దాడిని కార్మికవర్గం ఐక్యంగా ఎదుర్కోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. కంచరపాలెంలోని జి.సుబ్బారావు నగర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న సిఐటియు విశాఖ జిల్లా 13వ మహాసభలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ఆ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన నర్సింగరావు మాట్లాడుతూ సామ్రాజ్యవాద కుట్రలను ఎదుర్కొని రష్యా, లాటిన్ అమెరికా దేశాలలో కార్మిక వర్గం ముందుకు సాగిందన్నారు. హిట్లర్, జార్ చక్రవర్తి వంటివారినే నామరూపాలు లేకుండా చేసిన ఘనత కార్మిక వర్గానికి ఉందన్నారు. మన దేశంలో మిగతా 2లో..

జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్

సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి. కుమార్ తిరిగి ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎస్. జ్యోతీశ్వరరావు ఎన్నికయ్యారు. 26 మంది ఆఫీస్ బేరర్లుగా ఉన్నారు. 70 మందితో నూతన జిల్లా కమిటీ, 120 మందితో జిల్లా కౌన్సిల్ ఎన్నికైంది.

కెఎం.శ్రీనివాస్

ఆర్‌కెఎస్‌వి.కుమార్

ఎస్.జ్యోతీశ్వరరావు

నాటకంలోని ఓ సన్నివేశం

ఆకట్టుకున్న బుద్ధునితో నా ప్రయాణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రామాటాకీస్ రోడ్డులోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన 'బుద్ధునితో నా ప్రయాణం' తెలుగు నాటకం ఎంతగానో ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయం అకాడమీకి చెందిన 40 మంది కళాకారులు ఈ నాటకాన్ని ప్రదర్శించారు. లతా - రాజా ఫౌండేషన్ (హైదరాబాద్) రూ.50 లక్షల వ్యయంతో నిర్వహించిన ఈ నాటకాన్ని ఉచితంగా ప్రదర్శించారు. ఈ నాటకంలోని సన్నివేశాలు ఎంతగానో ఆలోచింపజేశాయి. దు్ఃఖం, పేదరికం, హింసకు మూలాలను, వాటికి విముక్తి మార్గాన్ని నాటకంలో చూపారు. నాటక ప్రదర్శనను విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ మెమోరియల్ సొసైటీకి భారత రాజ్యాంగం ప్రతిని వంశీకృష్ణ బహూకరించారు. కార్యక్రమంలో బొడ్డు కల్యాణరావు, జెవి.ప్రభాకర్, బత్తుల గౌతమ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు

▶ వార్త 6లో..

ఫార్మా సిటీ డెవలపర్‌గా రాంకీని తొలగించాలి

▶ వార్త 5లో..

29న రైవాడ నీరు విడుదల

▶ వార్త 5లో..

డెంగీ నివారణకు కృషి

'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి సందీప్

ప్రజాశక్తి - అనకాపల్లి

జిల్లాలో డెంగీ కేసులు ఇటీవల నమోదవుతున్న నేపథ్యంలో అప్రమత్తమై పటిష్ట చర్యలు చేపట్టామని అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి ఇ.సందీప్ తెలిపారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

డెంగీ నివారణకు ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలు తెలియజేస్తారా ?

రాష్ట్రంలో గత పది సంవత్సరాలుగా డెంగీ వ్యాధిని తగ్గించడంలో గణనీయ ప్రగతి కనిపించింది. డెంగీ నివారణకు ప్రభుత్వపరంగా పలు చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా మూడు పద్ధతుల ద్వారా డెంగీని ఓడించాలని ప్రజలకు పిలుపునిస్తున్నాం. చుట్టుపక్కల

దోమలు ఉత్పత్తి అయ్యే నీటి నిల్వలను లేకుండా చూడాలని, నీరు నిల్వ ఉండే తొట్టెలు, డబ్బాలు వంటి వాటిపై మూతలు ఉంచాలని స్థానిక ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తల ద్వారా మిగతా 2లో..

22 మంది డాక్టర్లు, నర్సులపై చర్యలు

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆదేశాలు
- 2020లో ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో అవినీతిపై విచారణ

ప్రజాశక్తి - అనకాపల్లి రూరల్ : అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ జిల్లా వైద్యాలయంలో అవినీతిపై ప్రభుత్వం స్పందించింది. 2020లో ఆసుపత్రిలో జరిగిన అక్రమ పాలనపై ఎసిబి ఇచ్చిన నివేదిక మేరకు చర్యలకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదివారం ఆదేశాలిచ్చారు. 22 మంది వైద్యులు, నర్సులపై ఈ మేరకు చర్యలు తీసుకోనున్నారు. వివరాల్లోకి వెళ్తే అనకాపల్లి ఆసుపత్రిలో పలు అక్రమాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారంతో 2020 ఫిబ్రవరిలో ఎసిబి ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. జరిగిన పలు అక్రమాలపై నివేదిక సమర్పించింది. ఈ క్రమంలో క్రమశిక్షణా చర్యలు చేపట్టేందుకు అప్పటి డిసిహెచ్‌ఎస్ (డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్), మరో తొమ్మిది మంది వైద్యులు, 12 మంది హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సుల అక్రమాలపై త్వరితగతిన విచారణ చేపట్టాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. లైసెన్స్ లేకుండా క్యాంటీన్ నిర్వహణ, భోజనం అందించాల్సిన రోగుల వివరాలను తెలపకపోవడం, ఆహార సరఫరా నాణ్యత పట్ల నిర్లక్ష్యం వహించడం, నియమాలకు భిన్నంగా సివిల్ పనులను కట్టబెట్టడం వంటివి జరిగాయనే ఆరోపణలు నాడు ఉన్నాయి. వైద్యులు, ఇతర సిబ్బంది హాజరును నియంత్రించకపోవడం, సరైన పర్యవేక్షణ చేయడంలో పూర్తిగా విఫలమైన అప్పటి డిసిహెచ్‌ఎస్‌పై మేజర్ పెనాల్టీ విధించేందుకు విచారణ చేపట్టాలని ఎసిబి అధికారులు ఈ ఏడాది జూన్‌లో ఇచ్చిన నివేదికలో సూచించారు. ఈ విషయాల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు తమ తమ విధుల నిర్వహణలో వైఫల్యం చెందిన మరో తొమ్మిది మంది వైద్యులపైనా క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని ఎసిబి సిఫారసు చేసింది. 12 మంది హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులపై కూడా క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని కోరింది. ఇన్‌పేషెంట్లను ఎక్కువగా చూపడంతోపాటు, రోగులకిచ్చే భోజనం నాణ్యతపై నిర్లక్ష్యం వహించడం, డైట్ చార్ట్‌ను ప్రదర్శించకపోవడం, మందుల సరఫరా, వినియోగం మిగతా 2లో..

అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ ఆసుపత్రి (ఫైల్)

మొదటి పేజీ తరువాయి..

22 మంది డాక్టర్లు, నర్సులపై చర్యలు

వివరాలను సరిగా చూపకపోవడం, తమ విధులను సరిగా నిర్వహించకపోవడం వంటి లోపాల కారణంగా వీరిపై చర్యలు చేపట్టాలని ఎసిబి అధికారులు తమ నివేదికలో సూచించారు. ఈ నివేదికలో వెల్లడైన అప్పటి పరిస్థితిపై వెంటనే విచారణ చేపట్టాలని, ఆ మేరకు తగు క్రమశిక్షణా చర్యలు చేపట్టి వారిని తగు విధంగా శిక్షించాలని మంత్రి ఆదేశించారు. దీంతో పాటు రూ.74,000 మేరకు వాహన ఇంధనం వినియోగంలో తప్పుడు లెక్కలు చూపిన డ్రైవరు, డ్రెస్సింగ్ పనులు చేసిన కాంట్రాక్టు శానిటేషన్ వర్కర్‌పై కూడా తగు క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఆదివారం ప్రకటన విడుదలైంది.

డెంగీ నివారణకు కృషి

తెలియపరుస్తున్నాం.

డెంగీ కారకాలను వివరించండి ?

ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే డెంగీ వ్యాధి విస్తరించడానికి ప్రధాన కారణం దోమలు. మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు, జికా వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాపిస్తాయి. వీటిలో డెంగీ అనేది వైరల్ ఫీవర్. ఇది ఎడిస్ అనే దోమ పగటిపూట కుట్టడం ద్వారా వస్తుంది.

వ్యాధి లక్షణాలు వివరిస్తారా ?

డెంగీ వచ్చిన వ్యక్తికి ఒక్కసారిగా అధిక జ్వరం, తలనొప్పి, కంటి వెనుక భాగంలో నొప్పి, కండరాల నొప్పులు, జుట్టు ఊడిపోవడం, చర్మంపై గుండ్రటి ఎర్ర మచ్చలు వంటి లక్షణాలు ఉంటాయి.

దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జిల్లాలోని ఇంటి పరిసరాల్లో తొట్లు, డబ్బాలు, టైర్లు, కొబ్బరి చిప్పలను తొలగించడం, నీరు నిల్వ లేకుండా చూడడం, ఇంటి పైకప్పు ఉన్న ట్యాంకులకు మూతలు అమర్చడం, భవన నిర్మాణ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉంచే ట్యాంకులను వారానికి ఒకసారి మార్చడం చేసేలా అవగాహన కల్పిస్తున్నాం.

దోమల నుంచి రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

దోమ కాటు నుంచి రక్షణ కోసం దోమతెరలు వాడాలి. ఇంటి కిటికీలకు జాలీలు అమర్చుకోవాలి. పొడవాటి దుస్తులు ధరించాలి. దోమలను చంపే క్రీములు, స్ప్రేలు వినియోగించాలి. ఇళ్లలో క్రిమి సంహారక మందులను పిచికారి చేయాలి. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించడం ద్వారా డెంగీని నివారించవచ్చు.

ఎబిబిఎస్‌పి విశాఖ జిల్లా అధ్యక్షునిగా తులసీదాస్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎబిబిఎస్‌పి విశాఖ జిల్లా అధ్యక్షునిగా తులసీదాస్ నియమితులయ్యారు. ఈ మేరకు నగరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పార్టీ జాతీయ సమన్వయకర్త, మాజీ డిజిపి డాక్టర్ జె.పూర్ణచంద్రరావు మాట్లాడారు. తులసీదాస్ లాంటివాళ్లు బిసి, ఎస్‌సి, ఎస్‌టిల హక్కుల కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఇదిలాఉండగా శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బూరగాం గ్రామానికి చెందిన మడ్డు తులసీదాస్ హైదరాబాద్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో అగ్రికల్చరల్ ఎంఎస్‌సి చేసి, అనంతరం స్టేట్ బ్యాంకులో డైరెక్ట్ ఆఫీసర్‌గా చేరి పలుచోట్ల బ్రాంచి మేనేజర్‌గా విధులు నిర్వహించారు. అనంతరం ఉద్యోగోన్నతిపై రీజినల్ మేనేజర్‌గా హైదరాబాద్, ఏలూరు, భీమవరంలో పని చేశారు. అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొంది విశాఖపట్నంలో స్థిరపడ్డారు.

మల్లాది శ్రీకాంత్‌కు ఎయు డాక్టరేట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం పరిశోధక విద్యార్థి మల్లాది శ్రీకాంత్‌కి ఎయూ డాక్టరేట్ లభించింది. 'ఉద్యోగి జీవిత చక్ర నిర్వహణ మరియు సంస్థ పనితీరుపై దాని ప్రభావం' అనే అంశంపై ప్రొఫెసర్ పుట్టపల్లి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిపిన పరిశోధనకు ఆయన డాక్టరేట్ పొందారు. ఈ మేరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య జి.పి.రాజశేఖర్ చేతుల మీదుగా డాక్టరేట్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ని పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు. మల్లాది శ్రీకాంత్ 2014లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంహెచ్‌ఆర్ఎం విభాగంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసారు. 1992లో గ్రాడ్యుయేషన్ అయ్యాక, 1993 నుండి డాక్టర్ రెడ్డీస్‌లో ఉద్యోగం పొందారు. రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్‌లో 31 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారు. ప్రస్తుతం లీడ్ ఎంప్లాయ్ రిలేషన్స్ అండ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సామాజిక బాధ్యతగా పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.

ఆటో స్టాండ్ ప్రారంభం

కార్యక్రమంలో పాల్గొన్న రాజు తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, వారు కోరుకున్న ప్రదేశానికి అతి తక్కువ చార్జితో గమ్యానికి చేర్చే మంచి సాధనం ఆటో అని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. ఆదివారం కృష్ణా గార్డెన్స్‌లో దుర్గా టెంపుల్ వద్ద విశాఖపట్నం జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు కర్రి గణేష్ ఆధ్వర్యంలో కొత్త ఆటోస్టాండ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాల కోసం ఈ ఆటోస్టాండ్ ప్రారంభించడం జరిగిందన్నారు. ఆటోస్టాండ్ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ భద్రతను దృష్టిలో పెట్టుకుని తక్కువ ధరకు రవాణా సాగిస్తున్నారని తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె. నర్సింగరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఈ ఆటోలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు నాయుడు మహేష్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

విశాల ఐక్య పోరాటాలు

(మొదటి పేజీ తరువాయి..)

నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను, దేశ సంపదను బహుళజాతి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు తీవ్రప్రయత్నాలు చేస్తోందన్నారు. దాన్ని అడ్డుకుంటున్న కార్మికవర్గంపైనా, నాయకులపైనా తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి ఉద్యమాలను అణిచివేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చి యజమానులకు అనుకూలంగా రూపొందించారన్నారు. వాటి అమలు కోసం నాలుగేళ్లుగా కేంద్రంలోని బిజెపి ప్రయత్నం చేస్తే కార్మికవర్గం పోరాడి నేటివరకు అమలు కాకుండా అడ్డుకోగలిగిందన్నారు. నేడు అదానీ, అంబానీలాంటి కార్పొరేట్ అధిపతులకు లాభాలు సమకూర్చేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారన్నారు. కార్మిక హక్కులను హరించడాన్ని నిరసిస్తూ ఈ నెల 9న దేశ వ్యాప్తంగా 28 కోట్ల మంది కార్మికులు సమ్మె చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయడానికి కేంద్రం పూనుకుంటే 1600 పైచిలుకు రోజులుగా కార్మికవర్గం పోరాడి అడ్డుకోగలిగిందన్నారు. నేడు ప్లాంట్ పోరాటాన్ని నీరుగార్చడానికి ప్యాకేజీని ప్రకటించి కార్మికుల్లో ప్రభుత్వం భ్రమలు కల్పిస్తోందన్నారు. ప్లాంట్‌లో ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను అన్యాయంగా తొలగించిన విషయాన్ని గుర్తుచేశారు. పర్మినెంట్ కార్మికులను విఆర్ఎస్ పేరుతో బయటకు పంపిస్తున్నారని తెలిపారు. ఈ అక్రమ చర్యలకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పోరాటాన్ని పోలీసులతో అణిచివేసేందుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. స్థానిక గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు డిపి, నాన్ డిపిలు పేరుతో కార్మికులను విచ్ఛిన్నం చేయడానికి పూనుకున్నారన్నారు. ఐక్య పోరాటాలతో ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటామన్నారు. విశాఖ డెయిరీలో యూనియన్ పెట్టుకొని వేతనాలు పెంచుకున్నారన్న కక్షతో యూనియన్ నాయకులను సస్పెండ్ చేయడంతో పాటు కాంట్రాక్ట్ కార్మికులను 300 మందిని తొలగించారన్నారు. డెయిరీ యజమాని బిజెపిలో చేరడంతో బలవంతంగా బిఎంఎస్ సంఘాన్ని అక్కడ పెట్టారన్నారు. దాన్ని కూడా కార్మికవర్గం ఎదుర్కొని పోరాడుతోందని తెలిపారు. విశాఖలో కార్మికులు పోరాడి అనేక హక్కులు సాధించుకున్నారన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం మతం పేరుతో కార్మికులను విచ్ఛిన్న పరుస్తోందని, రాష్ట్రంలో కూటమి నాయకులు సనాతన ధర్మం పేరుతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తున్నారని తెలిపారు. రాబోయే కాలంలో ఫిక్స్‌డ్ టెర్మ్, కాంట్రాక్ట్ విధానం, హైర్ అండ్ ఫైర్ విధానం మరింతగా అమలు చేయడానికి ప్రభుత్వాలు పూనుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 8 గంటల పనిని 10 గంటలకు పెంచడాన్ని, రాత్రి సమయంలో మహిళలు విధుల్లో పాల్గొనాలన్న నిర్ణయాన్ని పోరాటాలతో తిప్పికొట్టాలన్నారు.

అఖిల భారత మహాసభల విస్తృత క్యాంపెయిన్

విశాఖపట్నంలో ఈ ఏడాది డిసెంబరు 31 నుండి వచ్చే ఏడాది జనవరి 4 వరకు సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు జరుగనున్నాయని నర్సింగరావు తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టేందుకు ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రజలను కలిసి క్యాంపెయిన్ చేపట్టాలన్నారు. ఆ మహాసభల జయప్రదానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

గవర విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేవలం విద్యతోనే ఉన్నతస్థాయి గౌరవం లభిస్తుందని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు (పిజివిఆర్ నాయుడు) అన్నారు. కేంద్ర గౌరీసేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం కంచరపాలెం ఆశీర్వాద కళ్యాణ మండపంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రధాన కార్యక్రమం జరిగింది. సంఘం అధ్యక్షులు బుద్ధ శివాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, జార్ఖండ్ విసి ఆచార్య సూరిశెట్టి జవహర్, గౌరవ అతిథులుగా హాజరై ముందుగా గౌరీమాతకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ కేంద్ర గౌరీసేవా సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాల్లో విద్యార్థుల ప్రతిభా ప్రోత్సాహానికి మాత్రమే అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న ఈ కార్యక్రమం రాష్ట్రస్థాయిలో జరగాలని ఆకాంక్షించారు. విసి ఆచార్య సూరిశెట్టి జవహర్ మాట్లాడుతూ కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులతో పాటు గురువులకు,పెద్దలకు ముందు గౌరవం ఇవ్వాలన్నారు. విద్యార్థులు లక్ష్యం వైపు అడుగులు వేయాలన్నారు. అనంతరం బుద్ధ శివాజీ మాట్లాడారు. విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రధానం చేసి, జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మళ్ళ భాస్కరరావు, రిజిస్ట్రార్ పీలా సుజాత, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర పాల్గొన్నారు.

బాబుపై ప్రజా వ్యతిరేకత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అర్హులైన వారందరికీ లబ్ది చేకూరే విధంగా గత ప్రభుత్వంలో చేపట్టిన జగనన్న పథకాలు అమలు చేయలేక చంద్రబాబు ఏడాదిలోనే ప్రజావ్యతిరేకత ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆరోపించారు. 41వ వార్డులో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో జ్ఞానాపురం వైసిపి కార్యాలయం వద్ద ఆదివారం బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చేసిన అరాచక పాలనను నిరసిస్తూ నేడు ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా అధికంగా ప్రజానీకం హాజరు కావడం కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత తేటతెల్లమవుతుందన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులు

విశాఖ జిల్లా హెచ్‌డబ్ల్యుఒల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రస్థాయి హెచ్‌డబ్ల్యూఒల సంఘం ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లా హెచ్‌డబ్ల్యూఒల యూనియన్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఎన్నికల్లో విశాఖ జిల్లా హెచ్‌డబ్ల్యూఒలో జిల్లా అధ్యక్షునిగా జి.ఎస్.ప్రకాష్ , జనరల్ సెక్రెటరీగా ఈర్ల గోవింద్, జిల్లా ట్రెజరర్ గా పెంటకోట అనురాధ, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా పి.మోహిని ఎన్నికయ్యారు. వసతిగృహ సంక్షేమ అధికారుల సమస్యలు వాటి పరిష్కారాలు సాధించే విధంగా ముందడుగు వేస్తామని నుతన కార్యవర్గ సభ్యులన్నారు. అనంతరం. సోషల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు రామారావును నూతన సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పలు సర్వీస్ అంశాలపై చర్చించడం జరిగింది.

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 1965 of 2023

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law) & Authorized Officer,
...Plaintiff
And
Sri.Suggu S Reddy
...Defendant

To
Sri.Suggu S Reddy, S/o.Suggu Vemana Reddy, Aged about 46 Years, Occ: Employee, R/o.H.No.4-43-11, Pada walter, Visakhapatnam, A.P-530017.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,82,842-42ps _to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 22-08-2025.

In case of your failure to attend before the Court on 22-08-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, **HYDERABAD**-50.

IN THE COURT OF THE XXI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No.1454 of 2024

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager (Law) & Authorized Officer,
...Plaintiff
And
Sri.P.S.S.N.Raju,
...Defendant

To
Sri.P.S.S.N.Raju, S/o. P.L.N.Raju, Aged about 47 Years, Occ: Employee, R/o.D.No.6-108/6/19, 301 Sanjeevini Mansion, Priya Gardens, Simhachalam, Visakhapatnam-530028.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs. 3,47,340-18ps _to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 21-08-2025.

In case of your failure to attend before the Court on 21-08-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, **HYDERABAD**-50.

రహదారి, గెడ్డవాగు కబ్జాకు యత్నం

స్థానికుల ప్రతిఘటన

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం సర్వే నెంబర్ 307లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వెనుకభాగంలో ఉన్న జగనన్న కాలనీలో గెడ్డవాగును ఆక్రమించేందుకు కొంతమంది చేసిన యత్నం స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వైసిపి ప్రభుత్వంలో ఇచ్చిన సుమారు 145 ఇళ్లకు సంబంధించి 20 అడుగుల రహదారి ఉంది. ఇక్కడే వర్షాధార గెడ్డవాగు కూడా ఉంది. ఆదివారం తెల్లవారుజామున కొందరు వ్యక్తులు జెసిబిలతో వాగు ప్రాంతానికి చేరుకొని సుమారు 60 అడుగుల విస్తీర్ణంలో ఆక్రమణ పనులను ప్రారంభించారు. వాగు తమదే అంటూ మట్టిపనులు చేయడం ప్రారంభించారు. దీనిని గమనించిన కాలనీవాసులు వెంటనే సంఘటితమై కబ్జా ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. 'వర్షాకాలంలో వచ్చే నీరు ఎటు వెళుతుంది?' అంటూ ప్రశ్నించారు. కబ్జాదారులు తమ వద్ద పత్రాలున్నాయని చెబుతూ స్థానికులను భయపెట్టే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని వెంటనే రెవెన్యూ అధికారులకు తెలియజేయడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని ఆక్రమణ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రెవెన్యూ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, గెడ్డవాగును పునరుద్ధరించాలని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జగనన్న కాలనీలో రోడ్డును, గెడ్డవాగును ఆక్రమించి చదును చేస్తున్న జెసిబిని అడ్డుకున్న గ్రామస్తులు

అబ్దుల్ కలామ్‌కు నివాళి

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : అబ్దుల్ కలాం 10వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు ఎం.సంజీవ్‌కుమార్, కొక్కిరి అప్పన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్టూడెంట్ యునైటెడ్ నెట్‌వర్క్ ఆధ్వర్యాన కలాం విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్.బసవకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఎపిజె అబ్దుల్ కలాం 11వ వర్ధంతిని ఆదివారం అబ్దుల్ కలాం సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక జార్జి క్లబ్ వద్ద కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరిసే చిరంజీవి, ఆర్మీ రిటైర్డ్ జిల్లా ప్రెసిడెంట్ హనుమంతరావు, సిఎస్ఎఫ్, రిటైర్డ్ జిల్లా ప్రెసిడెంట్ రామారావు, బొట్టా చిన్ని యాదవ్ అమ్మిలోజు, మల్లేశ్వరరావు, కుంచా చిన్ను, బొబ్బిలి గోవిందరాజు, గుప్త పాల్గొన్నారు

సతీష్‌కు సన్మానం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సాయి రవీంద్ర స్కూల్ ప్రిన్సిపల్, ప్రైవేట్ టీచర్స్ యూనియన్ మండల అధ్యక్షులు వాండ్రాసి సతీష్‌ను ఆనందపురం సిఐ వాసునాయుడు, సోషల్ వర్కర్ వి.శ్రీనివాసరెడ్డి తదితరులు ఆదివారం సన్మానించారు. ఒఎస్‌జి ఫౌండేషన్ ఆధ్వర్యాన మండలంలోని తాళ్లవలస ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు శివ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలి

ప్రజాశక్తి- ములగాడ : తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలని, సమాజ కట్టుబాట్లు, నీతి నియమాల గురించి తెలియజేయాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి సూచించారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తల్లిదండ్రులు పిల్లలకు విద్య ఆవశ్యకతను తెలియజేయాలని, పుస్తకాలు చదవడంపై అభిలాష పెంచాలని సూచించారు. చిన్నారుల భావాలకు పునాది వేసేవారు తల్లిదండ్రులేనన్నారు. తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఎం.సురేష్ మాట్లాడుతూ, చిన్నారులు క్రమశిక్షణతో ఉండాలని, అపరిచితులకు దూరంగా ఉండాలని చెప్పారు. పిల్లలను సమాజానికి ఉపయోగపడేలా పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ అధ్యక్షతన తల్లిదండ్రులను సన్మానించారు.

ఘనంగా ఒఎస్‌జి వార్షికోత్సవం

రక్తదానం చేస్తున్న యువకులతో సిఐ వాసునాయుడు

ప్రజాశక్తి- ఆనందపురం : పెద్దిపాలెం సమీపంలోని ఆహ్వాన కళ్యాణ మండపంలో ఒఎస్‌జి ఫౌండేషన్ నాలుగో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆనందపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చింత వాసునాయుడు హాజరై మాట్లాడుతూ, ఒఎస్‌జి ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. రక్తదాన శిబిరాలు, ఆర్థిక సహాయం వంటి కార్యక్రమాలు మానవతా సేవకు నిదర్శనమని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ ఈ సేవా కార్యక్రమాల నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు.

విద్యావేత్త బావిశెట్టి రాజు మాట్లాడుతూ, ఒఎస్‌జి వ్యవస్థాపకుడు శివ దలాయి నిరుపేద కుటుంబంలో జన్మించి తన జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేశారన్నారు. ఒఎస్‌జి వ్యవస్థాపకుడు శివ దలాయి మాట్లాడుతూ, 2021లో స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు 49 రక్తదాన శిబిరాలు నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. యువతీయువకులు పాల్గొని రక్తదానం చేశారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ వైద్య బృందం రక్తాన్ని సేకరించింది. సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న యువత, గ్రామపెద్దలను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మరుపల్లి సాయిజ్ఞానేశ్వరరావు, దేముడుబాబు, గొలగాని నరేంద్ర, జై జవాన్ ఫౌండేషన్ ప్రతినిధులు కుప్ప రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాధవధార జర్నలిస్ట్స్ అసోసియేషన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-మాధవధార : మాధవధార జర్నలిస్ట్ అసోసియేషన్ రెండవ వార్షికోత్సవాన్ని ఆదివారం మాధవధారలోని ఒక ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు హాజరై సీనియర్ జర్నలిస్టులకు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజంలో జరిగే ప్రతి ఘటననూ ప్రజలకు చూపే విధంగా కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులు స్ఫూర్తిదాయకం అన్నారు. నిర్భయంగా వాస్తవాలను ప్రచురించాలని, అలాంటప్పుడే సమాజానికి మేలు జరుగుతుందని చెప్పారు. జాతీయ జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ జర్నలిస్టు సమస్యలపై పనిచేస్తూ, వారికి అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు నాగరాజు పట్నాయక్, 50, 51 వార్డుల కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, విఎంఆర్‌డిఎ మాజీ చైర్మన్ చంద్రమౌళి, 50, 51 టిడిపి వార్డుల అధ్యక్షులు సనపల వరప్రసాద్, సనపల కీర్తి, బిజెపి నాయకులు తమ్మినేని పద్మజ, సనపల రామకృష్ణ, కెవి.రమణ, మూల వెంకటరావు, బగాతి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

ఘనంగా కార్పొరేటర్ కెల్ల సునీత జన్మదిన వేడుకలు

నిరాశ్రయ వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు అందజేస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత, సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతసత్యనారాయణ జన్మదిన వేడుకలు ఆదివారం అమ్మానాన్న వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. వృద్ధులు, నిరాశ్రయుల మధ్య కేక్ కట్ చేసి వారికి పంచిపెట్టారు. పండ్లు, బిస్కెట్లు కూడా అందజేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వడిశెల శ్రీను, ఆనందరావు, కల్యాణి, కేశవరావు, దారపాలెం అసోసియేషన్ సభ్యులు చంద్రమౌళి, వర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తిపై హత్యాయత్నం

ప్రజాశక్తి-ఉక్కునగరం : పెదగంట్యాడ బిసి గేట్ లారీ యార్డ్ వద్ద ఈనెల 25వ తేదీన ఒక వ్యక్తిపై మరి కొంతమంది దాడి చేసి హత్య చేయటానికి ప్రయత్నించారని స్టీల్ ప్లాంట్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. ఫిర్యాదుదారుడు మొల్లి సంతోష్ కుమార్ దేశపాత్రునిపాలెంలో కుటుంబంతో నివాసముంటున్నాడు. ఓ ప్రైవేట్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న తన కుమార్తెను పాఠశాల నుంచి తీసుకురావడానికి 25వ తేదీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో పాఠశాలకు వెళ్లాడు. ఆటల పోటీలు జరుగుతున్నందున సాయంత్రం ఏడు గంటల వరకు పాఠశాల సమయం పొడిగించినట్లు చెప్పడంతో బాధితుడు సోదరులు సతీష్, గణేష్‌లతో మాట్లాడటానికి బిసి గేటు వద్ద ఉన్న లారీ యార్డుకు వెళ్లాడు. ఆ సమయంలో శివ, మొల్లి శ్రీను, వాసు, రవి దాడి చేశారని, శివ తలపై కర్రతో కొట్టాడని తీవ్రంగా రక్తస్రావం కావడంతో అక్కడి నుంచి తప్పించుకొని ఎస్‌విఎస్ పాలి క్లినిక్ వెళ్లినట్లు ఫిర్యాదుదారుడు తెలిపాడు. అనంతరం అగనంపూడి సిహెచ్‌సిలో చికిత్సకు పోలీసులు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోడి పందెం శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఆనందపురం: ఆనందపురం మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ చీమల వెంకటాపురంలో అక్రమంగా నిర్వహిస్తున్న కోడిపందాలపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుండి రూ.18,320 నగదు, రెండు కోళ్లు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -గోపాలపట్నం : గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని విశ్వసనీయ సమాచారం మేరకు గోపాలపట్నం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు ఆధ్వర్యాన పోలీసులు నార్త్ సింహాచలం రైల్వే క్వార్టర్స్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు మహిళలు రాధికా సేతి, మృత్యులమ్మ హండాల రెండు సూట్‌కేసులతో వెళ్తున్నారు. సూట్ కేసులను తనిఖీ చేయగా అందులో మొత్తం 22 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు.

పలుచోట్ల 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆనందపురం: ఆనందపురం మండలం బోని గ్రామపంచాయతీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యాన టిడిపి నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో తాట్రాజు అప్పారావు, బిఆర్‌బి.నాయుడు, సురాల వరప్రసాదరావు, శేఖర్ పాల్గొన్నారు.

తగరపువలస : కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ టిడిపి నాయకులు ఒకటో వార్డు పరిధిలోని శ్రీనగర్, రామ వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తమ్మిన సూరిబాబు, గరే సదానంద, కొప్పల కృష్ణ, పి.నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

రావికమతం:సపరిపాలనలో తొలి అడుగుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని రావికమతం మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కోమటి శంకర్రావు తెలిపారు. కొత్తకోట గ్రామంలో స్థానిక మాజీ సర్పంచ్ కోట నేలవేణి గోవింద తదితర పార్టీ నాయకులతో కలిసి కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి శంకరరావు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను, కె మూర్తి శ్రీను, గొర్లె కృపారావు, సత్యనారాయణ, నర్సింగరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని నునపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆదివారం మాజీ ఎంపి పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు పేల తులసిరాము,కార్యదర్శి కాండ్రేగుల అప్పారావు, ఎంపిటిసి పల్లి వెంకటరావు, రెడ్డి నగేష్, ,మండల ఉపాధ్యక్షులు దేశంశెట్టి వెంకటరమణ, పతివాడ చిన్నయ్య నాయుడు, రెడ్డి శ్రీను, మేడిశెట్టి అప్పలరాజు, రెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

గాయని చిత్ర జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సీతమ్మధార : సినీ నేపథ్య గాయని చిత్ర జన్మదిన వేడుకలు పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయని జికె.రాధను చిత్ర బిరుదుతో సత్కరించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ, గాయని, ఉపాధ్యాయులు జికె.రాధకు చిత్ర పేరిట బిరుదు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. ఘంటసాల స్మారక కళా పీఠం అధ్యక్షులు గ్రంధి విష్ణుమూర్తి మాట్లాడుతూ, సాంస్కృతిక రాజధానిగా ఖ్యాతి గాంచిన విశాఖలో కళలను ప్రోత్సహించడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కందుల నాగరాజు, సంఘ సేవకులు తోట ముకుంద్, ఉపకార్ ట్రస్ట్ మేనేజర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు. వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు సారథ్యంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. రమేష్ పట్నాయక్, జికె రాధ పాడిన మంచుకొండలోన, విశ్వ ప్రసాద్, కోమలి పాడిన స్నానాల గదిలోకి, దేవ రాజ్, సాత్విక పాడిన స్వాతి ముత్యమాల, మనోహర్, శైలజ పాడిన ఓ ప్రియా ప్రియా, సత్య, అనూష పాడిన ఓ చెలి కోపమా, రమేష్ కుమార్, షాను పాడిన శుభలేఖ రాసుకున్న, మురళీధర్, కోమలి పాడిన ఎన్నో రాత్రులు వస్తాయి గానీ ఇంకా వేణు మాధవా, వేణువై వచ్చాను, నిన్ను కోరి వర్ణం, ఒళ్లంతా జల్లంతా, ఈ క్షణం ఒకే ఒక కోరిక... వంటి చిత్ర గీతాలను గాయకులు ఆలపించారు.

ఆసుపత్రులు రిజిస్టర్ చేసుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : గ్రామీణ ప్రాంతంలో నడుస్తున్న ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2002/2007 ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవాలని డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. రిజిస్ట్రేషన్ లేకుంటే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రులు, క్లినిక్, ల్యాబ్‌లు ఆన్‌లైన్‌లో https://clinicalesttact.ap.gov.in/, స్కానింగ్ కేంద్రాల వారు https://pcpndt.ap.gov.in%/ ద్వారా ఆన్‌లైన్‌లో ఆగస్టు 5వ తేదీలోగా రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి కోర్టు ఇన్‌ఛార్జి ఎపిపిగా బత్తి రాజశేఖర్

ప్రజాశక్తి- విశాఖపట్నం : నగరంలోని షెడ్యూల్ కులాలు, తెగల ప్రత్యేక న్యాయస్థానం ఇన్‌ఛార్జి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది బత్తి రాజశేఖర్‌ను ప్రభుత్వ నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ న్యాయ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రాజశేఖర్ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్నారు. రెండు కోర్టుల్లో అన్ని క్రిమినల్ కేసులను ప్రాసిక్యూషన్ తరపున వాదిస్తారు.

న్యాయవాది పరిషత్ రాష్ట్ర అధ్యక్షునిగా అశ్విని కుమార్

ప్రజాశక్తి-విశాఖ లీగల్ :న్యాయవాది పరిషత్ రాష్ట్ర అధ్యక్షునిగా నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది ద్రోణంరాజు అశ్వినికుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం తిరుపతిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అశ్విని కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అశ్వినికుమార్‌కు విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎంకె.శ్రీనివాస్, కార్యదర్శి పార్వతీశ్వరనాయుడు అభినందనలు తెలిపారు. గత 22 ఏళ్లుగా అశ్వినికుమార్ విశాఖ న్యాయవాద సంఘం సభ్యులు కొనసాగుతున్నారు. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికపై జనసేన చర్చ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై జనసేన విశాఖ నగర కార్యాలయంలో పార్టీ నగర అధ్యక్షులు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పెందుర్తి ఎమ్మెల్యే రమేష్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్ ఆధ్వర్యాన ముఖ్య సమావేశం నిర్వహించి చర్చించారు. ఈ సమావేశంలో నియోజవర్గ ఇన్‌ఛార్జిలు ఉషాకిరణ్, ప్రశాంతి, సందీప్, శివప్రసాద్ రెడ్డి, జివిఎంసి డిప్యూటీ మేయర్ గోవిందరెడ్డి, జివిఎంసి ఫ్లోర్ లీడర్ వసంతలక్ష్మి, కార్పొరేటర్లు బెహరా భాస్కరరావు, నాగరాజు, సాదిక్, ఉషశ్రీ, లీలావతి, మేరీ జోన్స్, సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

అడవులను ధారాదత్తం చేసేందుకే 'కగార్'

ప్రజాశక్తి-సీతమ్మధార : దేశంలో తొమ్మిది కోట్ల ఎకరాల్లో ఉన్న అడవులను కార్పొరేట్లకు ధారాదత్తం చేయడానికి ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోందని ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ప్రసాద్ ధ్వజమెత్తారు. విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక నాయకుడు చలసాని ప్రసాద్ 10వ వర్ధంతి సభను పౌర గ్రంథాలయంలో ఆదివారం విరసం ఆధ్వర్యంలో నిర్వహించారు. చలసాని ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 'శాంతి చర్చలు-విప్లవ పంథా'పై సెమినార్ నిర్వహించారు. కగార్‌ఆపరేషన్ దేశ ప్రజలకు ఎందుకు శత్రువు? అనే అంశంపై పి.ప్రసాద్ మాట్లాడుతూ, వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామని కగార్ ఆపరేషన్ నిర్వహిస్తూ చట్ట విరుద్ధంగా మావోయిస్టులపై, ఆదివాసీలపై మారణకాండ సృష్టిస్తున్నారని తెలిపారు. విరసం కార్యదర్శి రివేరా మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ మూడు నెలల పాటు కాల్పుల విరమణ పాటించిందని తెలిపారు. శాంతి చర్చలు జరగాలని కేంద్రానికి లేఖలు పంపినా పట్టించుకోకుండా హత మారుస్తూనే ఉన్నారని తెలిపారు. శాంతి చర్చలు మావోయిస్టుల రక్షణ కోసం కాదని, దేశ కోసం,అటవీ సంపద కార్పొరేట్ల పాలు కాకుండా చేయడం కోసం అని పేర్కొనారు చలసాని ప్రసాద్ జీవితం-తాత్వికతపై ప్రజాస్వామ్య రచయితల వేదిక నాయకులు మల్లేశ్వరి మాట్లాడుతూ, మానవ జీవన క్రమమే తాత్వికత అని చలసాని ప్రసాద్ చెప్పేవారని తెలిపారు. సిపిఐ నాయకులు మానం ఆంజనేయులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం జీవిత కాలం నిబద్ధతతో పనిచేసిన మహా మనిషి చలసాని ప్రసాద్ అని కొనియాడారు. విరసం సీనియర్ నాయకుడు సిఎస్ఆర్.ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ మాట్లాడుతూ జైలు లేని దేశం, తాళాలు లేని ఇల్లు, పరీక్షలు లేని పాఠశాల చలసాని కోరిక అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్మ, మౌళి, లక్ష్మి, కె.పద్మ, లలిత చలసానితో తమకున్న జ్ఞాపకాలను గుర్తు చేశారు. ప్రజా కళామండలి, అరుణోదయ సంస్థలు కళా ప్రదర్శనలిచ్చారు.

సృజనాత్మకతను వెలికి తీస్తే చదువుకు దోహదం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పిల్లలల్లోని సృజనాత్మకతను వెలికి తీస్తే అది వారి చదువుకు దోహదపడుతుందని, ఇందుకోసం ప్రత్యేకంగా క్రియేటివ్ లెర్నింగ్ సెంటర్స్ ఫెసిలిటేటర్స్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ కె.సుశీల తెలిపారు. కంచరపాలెంలోని బిఎన్ఆర్ ఫౌండేషన్‌లో ఆసరా చారిటబుల్ సొసైటీ, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్తంగా క్రియేటివ్ లెర్నింగ్ సెంటర్స్ ఫెసిలిటేటర్స్ శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. శిక్షణను ఆసరా చారిటబుల్ సొసైటీ ప్రెసిడెంట్ సి.సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో ఆసరా ద్వారా 50 సెంటర్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనికి సిజిఆర్ ఇన్ఫ్రా లిమిటెడ్, పేరం గ్రూప్, వైశ్యరాజు జ్యూయలర్స్, హోరైజాన్ మెడికల్ సప్లయర్స్ ఆర్థిక సహకారాన్ని అందించారని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న విద్యార్థుల కోసం వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్, గిరి బాల నేస్తం ఆధ్వర్యాన ఈ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సెంటర్‌కు వచ్చే విద్యార్థులను అంచనా వేసి, ఎవరు ఎందులో బలంగా ఉన్నారో నిర్ధారించుకొని, ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సెంటర్ నిర్వహణ నిమిత్తం ఫెసిలిటేటర్స్ హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరించారు. కె.రమాప్రభ మాట్లాడుతూ, టీచర్‌కు అవసరమైన బాలల గేయాలు, ఆటలు, అంకెలతో ఆటలు, కథలు, చిన్నచిన్న ఆటలు తదితరాలతో క్రోడీకరించిన హ్యాండ్ బుక్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా గిరి బాల నేస్తం కన్వీనర్ వివి.జయ, అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధి ఉమామహేశ్వరరావు, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ కె.సుశీల, 50 మంది టీచర్లు పాల్గొన్నారు. కార్యక్రమం రిసోర్స్ పర్సన్లుగా శ్రీనాథ్, ఎల్లాజీ, రజిని, లక్ష్మణరావును తీసుకున్నారు. విసిసి జోన్ కన్వీనర్లు అప్పారావు, సుజాత, చంద్రశేఖర్, కోఆర్డినేటర్ సతీష్ పాల్గొన్నారు.

పంప్ సెట్ వితరణ

ప్రజాశక్తి- వేపగుంట : చీమలపల్లిలో ఉన్న వేద గాయత్రి మాత ఆలయానికి చీమలపల్లికి చెందిన సీనియర్ న్యాయవాది, వాండ్రంగి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వాండ్రంగి విశ్వేశ్వరరావు 1 హెచ్‌పి 10 స్టేజ్ సబ్ మెర్సిబుల్ పంప్ సెట్‌ను ఆలయ కమిటీ చైర్మన్ కె.రామకృష్ణకు అందజేశారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తవుతుందని ఆలయ చైర్మన్ తెలిపారు. మోటార్ వితరణ వల్ల అమ్మవారికి రోజూ పవిత్ర జలాలతో అభిషేకం చేయవచ్చని చెబుతూ దాతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వాండ్రంగి సుధారాణి, జీవన సిరి వైష్ణవి దివ్యాంషి, సూర్య శివ మణి, శారద మణి, లక్ష్మీనారాయణ, ఆరికతోట శ్రీనివాస్ పట్నాయక్, శ్రీదేవి, సాయికిరణ్, ఆలయ కమిటీ సభ్యులు శేఖర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి రామచంద్ర నగర్ డంపింగ్ యార్డ్ నుండి బర్మా కాలనీ బ్రిడ్జి వరకు మేజర్ గెడ్డ అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఏటా వర్షాకాలంలో ఈ ప్రాంతం ముంపునకు గురవుతుందని, మళ్లీ అటువంటి సమస్య పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రధాన గెడ్డలను అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు. గాజువాక నియోజవర్గంలో అన్ని వార్డులు అభివృద్ధి దిశగా ముందుకు వెళుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీను, వార్డు అధ్యక్షుడు జిత్తుక రాజు, సెక్రటరీ కూన వెంకట్రావు, రమణ, నారాయణ, రమేష్, నాగరాజు, జిలకర రమణ, నాగు, అనిత, సత్యారావు, సతీష్, రాజా, నాగు తదితరులు పాల్గొన్నారు..

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

క్రీడా మైదానం అభివృద్ధి

ప్రజాశక్తి -గాజువాక : ఉక్కు నిర్వాసితుల క్రీడా మైదానాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జివిఎంసి 75వ వార్డు పరిధి నిర్వాసితుల క్రీడా మైదానంలో శెట్టిబలిజ యూత్ ఆధ్వర్యాన ఎస్‌పిఎం క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-4 టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ క్రీడలను జీవితంలో ఒక భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు, జిల్లా నాయకులు పులి రమణారెడ్డి, జనసేన నాయకులు కోన చినఅప్పారావు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి-సీతమ్మధార : దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే, జనసేన పార్టీ నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో చిలకపేట విజయ ప్రసన్న ఆంజనేయ స్వామి చైర్మన్ ఇళ్ల రాజు ఆధ్వర్యాన 39వ వార్డు చిలకపేటకు చెందిన వైసిపి నాయకులు సిహెచ్.అప్పారావు, కోదండ, బుజ్జి, మునీంద్ర, వేణు, ఇల్లా పద్మ, చిన్ని, పోలరాజు, కనకమహాలక్ష్మి, పండు, సాయి, మౌనిక, నూకరాజు, సురేష్ తదితర సుమారు 100 మంది జనసేన పార్టీలో చేరారు. సీతంపేటలోని జనసేన నగర కార్యాలయంలో వారందరికీ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

కష్టపడిన వారికి తగిన గుర్తింపు

- మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



నక్క వెంకటరమణను సత్కరిస్తున్న నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని వైసిపి మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వైఎస్ఆర్‌టియుసి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నక్క వెంకటరమణను ఆదివారం టిఎన్ఆర్ క్యాంప్ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ, నక్క వెంకటరమణ పార్టీ స్థాపించిన నుంచి పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారన్నారు. ఇలాంటి పదవులు మరిన్ని పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, కొయ్య భారతి, గొందేసి రమణారెడ్డి, అండిబోయిన అప్పారావు, సంపంగి ఈశ్వరరావు, పిట్టా రెడ్డి, బోర శశిభూషణ్, పాల అప్పలరెడ్డి, నక్క అప్పారావు, వియ్యపు చంద్రరావు, తిప్పల గురునాథ్, బొడ్డ గోవింద్, గొందేశి అప్పలరెడ్డి, కురందాస్ వంశీ, టేకేటి వెంకటరమణ, పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి- ఆనందపురం : రౌడీ షీటర్లు మంచి మార్గంలో నడవాలని ఆనందపురం ఎస్ఐ సంతోష్ సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు చట్టపరంగా నడుచుకుంటూ కుటుంబాల భవిష్యత్తును బాగు చేసుకోవాలని సూచించారు. శాంతి, భద్రతకు అడ్డంకి కాకుండా, సమాజాభివృద్ధికి తోడ్పడే విధంగా ప్రవర్తించాలని చెప్పారు.

రామకృష్ణానందకు అవార్డులతో సత్కారం

ప్రజాశక్తి-సీతమ్మధార : శ్రీ మాతా కళాపీఠం ఆధ్వర్యాన ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆధ్యాత్మిక ప్రవచన కర్త రామకృష్ణానందకు ప్రవచన వాచస్పతి, ప్రముఖ గేయ రచయిత దుర్గాప్రసాద్ ఐనాడ, జనకవి బిరుదులు ప్రదానోత్సవం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథి వెంకయ్య చౌదరి మాటాడుతూ, కళాకారులను గుర్తించి, కళలకు ప్రాచుర్యమందించిన రామకృష్ణానందను సత్కరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య, విజయనగరం శ్రీరామనారాయణం ట్రస్ట్ చైర్మన్ నారాయణం శ్రీనివాస్, పాడేరు డిప్యూటీ ఎంపిడిఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాటేస్తున్న ఫార్మా కాలుష్యం

★ రాంకీ రసాయన వ్యర్థాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు

★ జల, పర్యావరణ కాలుష్యంపై అధికారుల మౌనం

★ పరిష్కార చర్యలు, నివేదికల వెల్లడితో సర్వత్రా గోప్యత

పరవాడలో రసాయన వ్యర్థాలను నిల్వ ఉంచే ఫార్మా కంపెనీ గొడౌన్

ప్రజాశక్తి. - పరవాడ : పరవాడ సెజ్‌లో ఫార్మా పరిశ్రమలు కాలుష్యం పర్యావరణాన్ని భస్మం చేస్తోంది. ముఖ్యంగా రాంకీ ఫార్మాస్యూటికల్స్ నిర్వహిస్తున్న వ్యర్థాల నిర్వహణ పద్ధతులు ప్రజారోగ్యాన్ని తీవ్రంగా ముప్పుగా పరిణమిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.కొన్ని నెలలుగా వ్యర్థ రసాయనాలు శుద్ధిచేయకుండానే కాలువల ద్వారా విడుదల చేస్తూ మొల్లోడు గెడ్డ, తాడికొండ వాలు, చివరికి పరవాడ పెద్ద చెరువు వరకూ చేరుతున్నాయి. దీంతో తాగు,సాగునీరు కాలుష్యమయమై ప్రజారోగ్యంతోపాటు పంటలకు తీవ్ర-నష్టం వాటిల్లుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. రసాయన వ్యర్థాల కాలుష్యం వల్లే ప్రజలు చర్మవ్యాధులు, కిడ్నీ, శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని వైద్యనిపుణులు స్పష్టం చేస్తున్నారు

అయినా పర్యావరణ, వైద్య ఆరోగ్య శాఖలు అటువైపు కన్నెత్తి చూడకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవలే రాంకీ సంస్థకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నోటీసులు జారీ చేసినప్పటికీ, వాటిపై అమలు చర్యల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఫార్మా కంపెనీలపై చర్యలు కేవలం కాగితాలపై పరిమితమౌతున్నాయి. కాలుష్యనియంత్రణ మండలి, ఎపిఐఐసి, ఎస్‌పిసిబి అధికారుల చర్యల్లో వెనకడుగు వెనుక ఆంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తాగేనీరు, పీల్చే గాలి, ఇళ్లు, పరిసరాలు, పంటపొలాలు ఇలా సర్వం కాలుష్యకారకంగా మారి, అనారోగ్యం, ఇతరత్రా సవాలక్ష సమస్యలతో జనం నిద్రలేని రాత్రులు గడుపుతున్నా ప్రభుత్వాలు, అధికారులకు చీమకుట్టినట్టయినా లేదని ఆవేదన వ్యక్తమౌతోంది. గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు ఫార్మా కాలుష్యానికి ప్రధానంగా ప్రభావితమౌతున్నారు కొన్నిచోట్ల నీటి నమూనాలు తీసి పరీక్షించినా ఫలితాలను వెల్లడించని అధికారుల తీరు అనుమానాలకు తావిస్తోంది. ఇంతగోప్యత పాటించడం వెనక కాలుష్యాన్ని మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నం కాక మరేమిటని బాధిత ప్రజలు మండిపడుతున్నారు

తక్షణం చేపట్టాల్సిన చర్యలు

పరిశ్రమల వ్యర్థాలపై పూర్తి స్థాయి విచారణకు హైపవర్ కమిటీ ఏర్పాటు చేయాలని, భూగర్భ జలాల విశ్లేషణ నివేదికలను వెల్లడించి, బాధ్యులైన సంస్థలపై కఠిన చర్యలు, అవసరమైతే పరిశ్రమ మూసివేత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. బాధిత ప్రజలకు ఉపశమనానికి వైద్యశిబిరాల నిర్వహణ, పరిహారం పంపిణీ, కలుషిత చెరువుల శుద్ధికి ప్రత్యేక చర్యలు వంటి డిమాండ్లపై ప్రభుత్వాల నుంచి, ఫార్మా యాజమాన్యాల నుంచి మౌనమే సమాధానమొస్తోందని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా కాలుష్యనియంత్రణ మండలి, ఎస్‌పిసిబిలు కళ్లు తెరవకుంటే,ఫార్మా కాలుష్యం పడగ ప్రజలను కాటేయక మానదని బాధిత ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

29న రైవాడ నీరు విడుదల

మరమ్మతులు పూర్తయిన పంట కాలువలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఖరీఫ్ సాగుకు రైవాడ జలాశయం నీటికి ఈనెల 29న మంగళవారం ంది ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి విడుదల చేయనున్నారని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జలాశయ చైర్మన్ పోతల పాతిరినాయుడు తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కుడి ఎడమ గేట్లు ద్వారా దేవరపల్లి కోటపాడు చోడవరం సహా దిగువ ఆయకట్టుతో కలిపి 15,344 ఎకరాలకు నీరు విడుదల చేస్తున్నామన్నారు. వర్షభావ పరిస్థితుల్లో నారుమళ్లు ఎండిపోకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. కాలువల పూడికతీతకు ఎమ్మెల్యే బండారు కృషితో రూ.75 లక్షలు మంజూరు కాగా, జలాశయ డిఇఇ సత్యంనాయుడు సారధ్యంలో పనులు చేపట్టిన నేపథ్యంలో శివారు ఆయకట్టు భూములకు సాగునీరు అందుతుందన్నారు ప్రస్తుతం రై వాడ జలశయం నీటి మట్టం111,60,మీటర్లు ఉందన్నారు. నీటి విడుదల సందర్భంగా ఎమ్మెల్యే బండారు జలహారతినిస్తారని జలాశయ చైర్మన్ పాతిరి నాయుడు తెలిపారు

చెర్లోపల్లి ఖండం లేఅవుట్ సమస్య పరిష్కార చర్యలపై హర్షం

చెర్లోపలి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి -అనకాపల్లి : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న చెర్లోపల్లి ఖండం లేఅవుట్ సమస్య పరిష్కారానికి రాష్ట్రకేబినెట్ ఆమోదం తెలపడంపై నిర్వాసిత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం స్థానిక జనసేనకార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు.

18 ఏళ్లుగా నాన్చుతున్న సమస్య పరిష్కారానికి చొరవ చూపడంపై హర్షం వ్యక్తం చేశారు. వీలైనంత త్వరలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ,. త్వరలోనే విఎంఆర్‌డిఎ విసి, అధికారులతో సమావేశంలో అన్ని విషయాలు చర్చిస్తామన్నారు. విశాఖ నగరానికి ధీటుగా చెర్లోపల్లి ఖండం లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తామని భరోసానిచ్చారు.

ఫార్మా సిటీ డెవలపర్‌గా రాంకీని తొలగించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి- అనకాపల్లి : అక్రమాలకు పాల్పడుతున్న రాంకీ సంస్థను ఫార్మాసిటీ డెవలపర్‌గా తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, వివి శ్రీనివాసరావులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పరవాడ ఫార్మాసిటీలోని డెవలపర్‌గా ఉన్న రాంకీ యాజమాన్యం కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు (సిడబ్ల్యుఎంపీ)లో ఫార్మా ఘన వ్యర్థపదార్థాలను నిల్వ చేయడం నిబంధనలకు విరుద్ధం అన్నారు. రాంకీకి ఉన్న ల్యాండ్ ఫిల్ నిండిపోతే, సిడబ్ల్యుఎంపిలోనే వేలాది టన్నులు వ్యర్థ పదార్థాలను అక్రమంగానిల్వ ఉంచడం వలన సమీప పరవాడ, తానాం గ్రామాలు కాలుష్య కారకమౌతుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

దీనికి తోడు రాంకీ యాజమాన్యం సమీపంలో ఉన్న ఊర చెరువు, పెద్ద చెరువు, సన్యాసి చెరువు, మొల్లోడుగెడ్డల్లోకి వ్యర్థ రసాయనిక జలాలను విడుదల చేస్తోందని, దీనిపై జిల్లా అధికారులకు అనేక మార్లు ఫిర్యాదు చేయడంతోపాటు ఇప్పటికే నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్‌లో కేసు వేశామన్నారు. ల్యాండ్ ఫీల్డ్‌లో కాకుండా ప్రభుత్వం నుంచి అనుమతులు నిరాకరించిన స్థలంలో అత్యంత ప్రమాదకరమైన ఘన వ్యర్థాలను రాంకీ యాజమాన్యం అక్రమంగా నిల్వ చేయడం దుర్మార్గమన్నారు.

కాలుష్యనియత్రణ మండలి అధికారులు నోటీసులిచ్చినా నిబంధనలు ఉల్లంఘించి రాంకీ యాజమాన ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుందన్నారు. రాంకీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోకుంటే ఉద్యమించక తప్పదనిహెచ్చరించారు.

బదిలీ సచివాలయ సిబ్బందికి సత్కారం

ప్రజాశక్తి- సబ్బవరం.: మండలంలోని అంతకాపల్లి సచివాలయంలో ఐదేళ్ల పనిచేసి బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి సిహెచ్ రవి, విఆర్ఒ పీవీఎస్ఎన్ మూర్తి, వెల్ఫేర్ అసిస్టెంట్ వి.మహాలక్ష్మి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎన్. శ్రావణి ఎఎన్ఎం సిహెచ్ దేవకిలను స్థానిక సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి ఎంపిటిసి చొక్కాకుల గోవింద్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనకాపల్లి జిల్లా గ్రామ విఆర్ఓ సంఘం అధ్యక్షులు ఎస్‌టి రామకాసు మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు, ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు, మాజీ సర్పంచ్ ఎస్. దేవుడు,పాల్గొన్నారు.

అలాగే బాటజంగాలపాలెం సచివాలయ సిబ్బందిని కూడా సర్పంచ్ పడాల వెంకట రమణ ఆధ్వర్యంలో సత్కరించారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ డి ఆనందరావు, విఆర్ఒ రామప్పారావు వార్డ్ మెంబర్లు. గొర్ల నూకరాజు, నకిరేబోయిన ఈశ్వరరావు బలిరెడ్డి నూకరాజు, నాగులపల్లి కోటిలింగం, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ తూట్టనూకరాజు, తాడి రమణ, పందిరిపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

జగ్గారావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో ఆదివారం తిమ్మరాజుపేట మాజీ సర్పంచ్ శరగడం లక్ష్మీ జగ్గారావు, అతని అనుచరులతోపాటు రాజానపాలెం, ఉద్దండపాలెం, సెజ్ కాలనీలకు చెందిన పలువురు వైసిపి నేతలు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి జనసేనలో చేరారు. వైసిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉండడంతోపాటు ఆపార్టీ యువజన విభాగం అధ్యక్షునిగా, ఐదేళ్లపాటు సర్పంచ్‌గా వ్యహరించిన జగ్గారావు, జనసేన పార్టీ విధానాలు, ఎమ్మెల్యే విజయకుమార్, జనసేన ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి సతీష్‌కుమార్ పనితీరు, చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితుడై జనసేనలో చేరుతున్నట్లు వెల్లడించారు. జనసేనలో చేరిన నేతలు, కార్యకర్తలందరికీ ఎమ్మెల్యే విజయకుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షులు బి రాందాస్, పి వాసు, ద్వారపురెడ్డి బాబ్జి, రాజన్న, భాషా పాల్గొన్నారు.

పి4, కర్మయోగి యాప్‌ల బాధ్యత నుంచి టీచర్లను మినహాయించాలి

• యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉపాధ్యాయులను పీ4, కర్మయోగి యాప్ బాధ్యతల నుంచి మినహాయించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు ఆదివారం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు కాకుండా బోధనేతర పనులకు వినియోగిస్తే విద్యా ప్రమాణాలు కుంటుపడతాయని ఆవేదనను వెలిబుచ్చారు. పి4 పథకాలలో భాగంగా ఉపాధ్యాయులకు, వారు పని చేసే గ్రామాలలో కుటుంబాలను కేటాయించి, దత్తత తీసుకోమని చెప్పడం బోధనేతర పనుల కిందకే వస్తుందన్నారు. పి4 విధానంలో ఉపాధ్యాయులకు రెండేసి, హెచ్ఎంలకు ఐదేసి కుటుంబాలను దత్తత తీసుకోమనడం సరికాదన్నారు.. అలాగే కర్మయోగి యాప్ ను ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దుతున్నారని, దీని వల్ల ఆన్‌లైన్ కోర్సుల్లో 56 వీడియోలు ప్రతి ఉపాధ్యాయుడు పూర్తి చేయాలని బలవంతం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులను భయపెడుతున్న విద్యాశాఖాధికారులు ఒక వారం రోజులు పాఠశాలల్లో పనిచేయాలన్నారు.రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు 2 నెలల నుండి జీతాలు రాకుడా చేసిన విద్యాశాఖాధికారుల వైఖరిని ఖండించారు.. యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ పాఠశాలలకు అవసరమైన యాప్‌లకు ప్రభుత్వమే డివైజ్ లు కొనుగోలు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యాశక్తి ప్రోగామ్ ఆప్షనల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా సహాధ్యక్షులు రొంగలి అక్కు నాయుడు, కార్యదర్శులు పొలిమేర చంద్రరావు, రమేష్ రావు, శేషుబాబు, సీనియర్ నాయకులు జి కే ఆర్ స్వామి, అలివేలు, హైమావతి,ఎల్లయ్యు బాబు, మామిడి బాబూరావు, సలీం, రవి పాల్గొన్నారు.

నూకాంబిక సన్నిధిలో క్రికెటర్ నితీష్

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : గవరపాలెం నూకాంబిక అమ్మవారిని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, భారత క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి, ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రామకుమారి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. . తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్లబాబు) ఆలయ ఇఒ కెఎల్.సుధారాణి, ఆలయ ధర్మకర్తలు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు వాహనమిత్ర ఇవ్వాలి

ప్రజాశక్తి- చోడవరం రూరల్: ఆటో కార్మికులకు వాహన మిత్ర కింద రూ.15వేలు సాయం ఇవ్వాలని డిమాండ్ ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు, జిల్లా కార్యవర్గసభ్యులు రెడ్డిపల్లి అప్పలరాజు, జిల్లా సమితి సభ్యుడు వియ్యపు రాజు డిమాండ్ చేశారు. ఆదివారం చోడవరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో సంపత్ వినాయక ఆటో యూనియన్ కార్మికులు నిరసన ప్రదర్శన, మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గుంతల రోడ్లతో ఆటోలు తరచూ మరమ్మతుకు గురౌతున్నాయని, వెంటనే రహదారులు బాగు చేయించాలన్నారు. బీమా రేట్లు తగ్గించాలని, ఆటో కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐతో కూడిన సంక్షేమ పథకాన్ని పెట్టాలని, ఆటో కార్మికులపై పెట్టిన కేసులు రద్దు చేయాలని, ఆటోలకు మాన్యువల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి- దేవరాపల్లి :రైతులకు నాణ్యమైన ఎరువులు సరైన ధరలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయ అధికారిణి ఎల్‌వై. కాంతమ్మ తెలిపారు. ఆదివారం దేవరాపల్లి మండలంలోని లైసెన్సు పొందిన హేమ రైతుడిపో, గ్రోమోర్ షాప్, కాశీపురంలోని శ్రీ లక్ష్మీనారాయణ, వెంకటరోహిణి దుకాణాలు తనిఖీ చేసారు. దుకాణాల బయట ధరల పట్టిక తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. ఎరువుల అమ్మకం వివరాలను బిల్ బుక్‌లో నమోదు చేసి, రైతుల సంతకం తీసుకోవడంతోపాటు రశీదు ఇవ్వాలన్నారు. ఏరోజుకారోజు స్టాక్‌బుక్‌లో నిల్వల వివరాలను నమోదు చేయాలన్నారు.

వైఎస్ విగ్రహం ధ్వంసంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్: మండలంలోని. కొత్తూరు గ్రామంలో వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు రంధ్రం పెట్టడంపై స్థానిక వైసిపి నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ సిఐ విజయకుమార్‌కు ఫిర్యాదు చేశారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రాజకీయ నేతల విగ్రహాలను పరిరక్షించాలని కోరారు. దీనిపై సిఐ స్పందిస్తూ, రాజకీయ నాయకుల విగ్రహాల జోలికి వెళ్లడం సరికాదని, ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు ఉంటాయన్నారు. ఎవరో మద్యం మత్తులో వైఎస్ఆర్ విగ్రహానికి కన్నం పెట్టారని తమ వద్ద ప్రాథమిక సమాచారం ఉందన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో వైసిపి పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, నాయకులు కొణతాల మురళీకృష్ణ, జాజుల రమేష్, కెఎం.నాయుడు, వేగి త్రినాథ్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ముగిసిన ఆడిట్

ప్రజాశక్తి. -సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి సీతాలక్ష్మి ఈ నెల 31న ఉద్యోగవిరమణ సందర్భంగా, అక్టోబర్ 2021 నుంచి ఇప్పటివరకు వరకు కళాశాలకు విద్యాశాఖ విడుదల చేసిన నిధుల వినియోగం, విద్యా ప్రమాణాలపై ఆడిట్‌లో అన్నీ సక్రమంగా ఉన్నట్లు రాజమండ్రి, కళాశాల విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు, డాక్టర్ పివి. కృష్ణాజీ తెలిపారు. రాజమండ్రి ఆర్‌జెడి కార్యాలయం నుంచి సుబ్రహ్మణ్యం, ఎస్.సుధీర్, వి. సతీష్‌కుమార్, ఎ.దుర్గాప్రసాద్ ఈ నెల 23 నుండి 26 వరకు ఆడిట్ నిర్వహించారన్నారు.

ఘనంగా కాలేజీ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో కళాశాల వ్యవస్థాపకులు కోరుకొండ లింగమూర్తి 81వ వర్ధంతి, కళాశాల ఫౌండర్స్ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. లింగమూర్తి విగ్రహానికి కళాశాల గవర్నింగ్ బాడీ ప్రెసిడెంట్ శ్రీధరాల కష్ణ పేర్రాజు, వర్తక సంఘ అధ్యక్షులు తమ్మన రఘుబాబు పూలమాలలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లింగమూర్తి జీవిత విశేషాలనుకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయబాబు వివరించారు. అనంతరం భారతరత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యులు కర్రి శివ సూర్యనారాయణ, పెంటకోట బాలకృష్ణ, వాసిరెడ్డి బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ టి. నిరంజన్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు!

- అధికారులతో ప్రభుత్వం అబద్ధపు ప్రచారం
- సిపిఎం ఆధ్వర్యాన కరపత్రాలు పంచుతూ ఇంటింటా ప్రచారం

అనకాపల్లిలో కరపత్రాలను పంచుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : విద్యుత్ స్మార్ట్‌మీటర్లపై కూటమి ప్రభుత్వం అబద్ధపు ప్రచారం మానుకోవాలని సిపిఎం నేతలు అన్నారు. ఆదివారం స్మార్ట్‌మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని పిలుపునిస్తూ, ఆదివారం అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం, పొలమరశెట్టి వారి వీధి, గంగిరావిశెట్టి వీధి, శతకం పట్టు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, సీనియర్ నాయకులు కాళ్ళ తెలయ్యబాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వలన విద్యుత్ బిల్లులు పెరగవని, ఎటువంటి ఇబ్బంది ఉండదని, విద్యుత్ శాఖ అధికారుల ద్వారా అవాస్తవాలను ప్రభుత్వం ప్రచారం చేస్తూ ప్రజలను మోసపుచ్చడం సరికాదని తీవ్రంగా ఖండించారు. నాడు విపక్షంలో ఉన్నపుడు వ్యతిరేకించిన కూటమి నేతలు, నేడ స్మార్ట్‌మీటర్ల బిగింపునకు ఉబలాటపడడం దుర్మార్గమని మండిపడ్డారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల భారాన్ని ప్రజలందరూ తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెంటకోట శ్రీనివాసరావు, దాడి సంపత్ కుమార్, భీశెట్టి సుబ్బారావు, బుగిడి నూకఅప్పారావు పాల్గొన్నారు.

కశింకోట : మండల కేంద్రంలోని భవానీనగర్ కాలనీలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించవద్దని పిలుపునిస్తూ సిపిఎం నాయకులు ఆదివారం ఇంటింటా కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వివి.శ్రీనివాసరావు, దాకారపు శ్రీనివాసరావు, డిడి వరలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర విధానాలను రాష్ట్ర ప్రభుత్వాలు మరింత వేగవంతంగా విరమించుకోవాలని అన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించినచోట నాలుగైదు రెట్లు బిల్లు భారాలతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని, పేద, సామాన్య ప్రజలకు,చిన్న పరిశ్రమలకు చిన్న చిన్న షాపులకు స్మార్ట్‌మీటర్లు గుదిబండలా మారాయన్నారు. వాడకాన్ని బట్టి కాకుండా, సమయం, డిమాండ్‌ను బట్టి వినియోగదారులకు ముంచేసే స్మార్ట్‌మీటర్లను అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

వడ్డాది : వడ్డాది ఎస్‌సి కాలనీలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగింపును అడ్డుకోవాలని పిలుపునిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. సిపిఎం నాయకులు ఎస్‌వి నాయుడు, పి సాంబశివరావు మాట్లాడుతూ ఇప్పటివరకు వ్యాపార సంస్థలకు షాపులకు బిగించిన స్మార్ట్ మీటర్లను ఇపుడు ఇళ్లకు బిగిస్తూ వినియోగదారులపై భారం మోపడం అన్యాయమన్నారు.

వడ్డాదిలో స్మార్ట్‌మీటర్లపై సిపిఎం ఆధ్వర్యాన నిరసన

కశింకోటలో ఇంటింటా సిపిఎం నేతల ప్రచారం

ఇప్పటికే సర్దుబాటు ఛార్జీల పేరుతో తడిసిమోపెడైన విద్యుత్ బిల్లులు, స్మార్ట్‌మీటర్లతో ఆకాశాన్నంటడం ఖాయమని, వీటిని తిరస్కరించాలని పిలుపునిచ్చారు

కోటవురట్ల: అదాని గ్రూప్స్ ను పెంచి పోషించేందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లు ప్రవేశపెడు తున్నాయని, అవి మాకు ఎంత మాత్రం వద్దని సిపిఎం నాయకులు ఇరెళ్ళి చిరంజీవి అన్నారు. ఆదివారం మాకవరపాలెం మండలంలో తూటిపాల, బూరుగుపాలెం నగరం, కోడూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. స్మార్ట్ మీటర్లను టీవీ, ఫోన్‌లా రీఛార్జ్ రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుందని, విద్యుత్ వాడకాన్ని బట్టి టారిఫ్ రేటు పెరిగిపోతూ ఉంటుందని తెలిపారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను తిరస్కరించిన టిడిపి నాయకులు ఇప్పుడు నోరు మెదపడం లేదని ఎద్దేవా చేశారు.

ఆరిలోవ : ప్రజలపై విద్యుత్ భారాలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను పెట్టే ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుతూ సిపిఐ ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యాన ఆరిలోవ పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రెహ్మాన్, నాయకులు కాసుబాబు, కె.లక్ష్మణరావు, పుష్పలత, మధు, విజయ, అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

సన్మానం పొందిన విశ్రాంత హెచ్‌ఎంలు

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రభుత్వ రంగ విద్యా విధానాన్ని బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయుల కృషి చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కోశాధికారి సివివి సత్యనారాయణ కోరారు. ఆదివారం అనకాపల్లి గౌరీ గ్రంథాలయం సమావేశ మందిరంలో 2024 జనవరి నుండి 2025 జూన్ మధ్య ఉద్యోగ విరమణ పొందిన 30 మంది ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ సమస్యలను పరిష్కరించాలని ఎంఇఒలబదిలీలు చేపట్టాలన్నారు. జిల్లా ఉప విద్యా శాఖ అధికారి పొన్నాడ అప్పారావు, పరీక్షల విభాగం సహాయ కమిషనర్ పి శ్రీధర్‌రెడ్డి, డిసిఇ బోర్డు చైర్మన్ సిహెచ్ సత్యనారాయణ, సాయిబాబా మాట్లాడుతూ హెచ్‌ఎంలపై పని ఒత్తిడి తగ్గించాలని, బోధనేతర విధుల నుంచి విముక్తులను చేయాలని కోరారు. అన్ని ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్ ఆపరేటర్, గుమాస్తా పోస్టులను మంజూరు చేయాలన్నారు. సంఘం రాష్ట్ర కోశాధికారి సివివి సత్యనారాయణ రాష్ట్ర పరిశీలకులుగా, సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ ఎన్నికల అధికారిగా ం అనకాపల్లి జిల్లా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘ నూతన కమిటీ ఎన్నిక జరిగి నూతన కమిటీ అధ్యక్షులుగా ఎవిహెచ్. శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా ఆళ్ల శేఖర్, కోశాధికారిగా నాగేంద్ర, స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఎమ్మెస్ ప్రసాద్, కెఆర్‌ఎస్ నాయుడు, ఏ వరహామూర్తిలను ఎన్నుకున్నారు.

వ్యవసాయానికి 'ఉపాధి'ని అనుసంధానించాలి

ప్రజాశక్తి- మునగపాక: వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలని వైకాపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక రాహుల్ గాంధీ కళ్యాణ మండపంలో గ్రామ రైతు సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ వ్యవసాయం గిట్టుబాటు కాని పరిస్థితి ఉందన్నారు నీటితీరువా పన్నులభారం,స్మార్ట్ మీటర్లు రైతులను కుంగదీస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా రైతుసంఘం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎఎన్‌వి మహేష్ ఏకగ్రీవంకాగా,కార్యదర్శి, సహాయ కార్యదర్శి, ఉపాధ్యక్షులు, కోశాధికారులుగా విల్లూరు నూక నరసింహారావు, ఆడారి లక్ష్మణరావు, దాడి శివ, ఆడారి శ్రీకాంత్ ఎన్నికయ్యారు. బదిలీపై వెళుతున్న విఎ గౌరీ సింధుజను సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్రి సాయికృష్ణ, దాడి ముసలి నాయుడు, పెంటకోట విజయ్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీపీ మల్ల జయలక్ష్మి, టెక్కలి పరశురాం, ఆడారి గణపతి అచ్చం నాయుడు, కోనపల్లి రామ్మోహన్‌రావు, మల్ల సంజీవరావు, కాండ్రేగుల జగ్గారావు, టెక్కలి జగ్గారావు పాల్గొన్నారు.

రైతు సంఘం నూతన కమిటీకి అభినందన

కార్గిల్ వీరసైనికులకు ఘననివాళి

ప్రజాశక్తి -అనకాపల్లి : కార్గిల్ యుద్ధవిజయంలో వీర సైనికుల పాత్ర మరువలేనిదని ఎస్ ఐ పి రాములమ్మ అన్నారు. స్థానిక ఎడి..మహిళా డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ దివస్‌ను సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు.విజేతలకు ఎస్ఐ పి.రాములమ్మ బహుమతులు అందజేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం, కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు బొడ్డు సోమరాజు, కొత్తూరి రామారావు, అయ్యవరం రమణమూర్తి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఆసుపత్రికి వచ్చే రోగులకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కోరారు.ఆదివారం స్థా సంజీవిని ఆసుపత్రి వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మూడేళ్లుగా సంజీవిని ఆసుపత్రి గ్రామీణ ప్రాంత రోగులకు ప్రశంసనీయమైన సేవలు అందిస్తూ ప్రజాభిమానాన్ని చూరగొనడం అభినందనీయమన్నారు. ఉచిత వైద్య శిబిరంలో ఇసిజి, బిపి, ఎఫ్‌బిఎస్, పిపిబిఎస్, నోటి, రొమ్ము కేన్సర్ తదితర వ్యాధులకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఆడారి చంద్రశేఖర్, డాక్టర్ గండి నిరుపమ. డాక్టర్ గౌరు నాయుడు, డాక్టర్ సతీష్ రెడ్డి, డాక్టర్ కరిష్మా డాక్టర్ ఆళ్ల వసంత్‌కుమార్, డాక్టర్ డానియేల్ పాల్గొని సేవలు అందించారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

గిరిజనుల గోడు పట్టదా..

▶▶ బురదరోడ్డుపై విద్యార్థుల రాకపోకలు, అవస్థలు పడుతున్న వాహనదారులు

▶▶ అంగన్వాడీ కేంద్రానికి వెళ్లాలంటే గెడ్డ దాటాల్సిందే..

▶▶ ప్రభుత్వాలు మారుతున్నా మారని గిరిజన గ్రామాల దుస్థితి

రోడ్డు మరమ్మతు చేపట్టాలని వేడుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి-మాడుగుల: ప్రభుత్వాలు మారాయి.. మారుమూల గిరిజన గ్రామాల రోడ్ల నిర్మాణంపై మాత్రం అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో, అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు వెళ్లేందుకు రోగులు, పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొద్ది పాటి వర్షానికి బురదమైన రోడ్లపై నానా అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇదీ గిరిజన గ్రామాల్లో గిరిజనుల దుస్థితి

చుట్టుగెడ్డ గ్రామం

మాడుగుల మండలంలో కృష్ణంపాలెం పంచాయతీ పరిధిలో పులిగుమ్మి, చుట్టుగెడ్డ గ్రామాలు ఉన్నాయి. ఈ రెండు గ్రామాల్లో సుమారు 2వందల మంది వరకు జనాభా ఉండగా, సుమారు ఎనభైమంది ఓటర్లు ఉన్నారు. 20 మంది పాఠశాల విద్యార్థులు, పది మందికి పైగా బాలింత పిల్లలు, గర్భిణీలు ఉన్నారు. కృష్ణంపాలెం గ్రామం నుంచి సుమారు రెండు కిలో మీటర్లు దూరంలో ఉన్న ఈ గ్రామాలకు రోడ్డు సదుపాయం లేక నానా అవస్థలు పడుతున్నారు. ఉన్న మట్టిరోడ్డు చిన్నపాటి వర్షం పడినా బురదమయంగా మారుతుంది. దీంతో ఆ గ్రామాలలో పండించే ఫలశయాలు విక్రయించే ందుకు, వైద్య పరమైన అత్యవసర సమయాలో పట్టణ ప్రాంతాలకు రావాలన్నా, ఈ బురుదరోడ్డతో అవస్థలు పడుతున్నారు. సుమారు 20మంది విద్యార్థులు ఈ రోడ్డుగుండా కృష్ణంపాలెం, కాశీపురం పాఠశాలకు వెళుతున్నారు. పది మందికి పైగా బాలింతలు, గర్భిణీలు 2కిలోమీటర్ల దూరంలో ఉన్న యలంపాడు గ్రామంలో ఆంగన్వాడి కేంద్రానికి గెడ్డదాటుకొని మరీ వెల్లాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్న చిన్న వర్షాలకు విద్యార్థులు కాలినడకన వెళ్లిప్పటికీ, భారీ వర్షాలు కురిస్తే ఇంటికే పరిమితం అవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. యలంపాడు గ్రామంలో ఉన్న సుమారు 10మంది అంగన్వాడి కేంద్రాలకు వెల్లాలంటే గెడ్డ దాటుకొని వెళాల్సిన పరిస్థితి ఉంది. ఇక్కడ ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా, పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులు, అదికారుల జాడ లేదని ఆ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని హడావుడి చేసి కొలతలు వేసి నెలలు గడుస్తున్నా నేటి వరకు రోడ్డు నిర్మాణం చేపట్ట లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆస్పత్రులకు వెళ్లాలన్నా, పండించిన పంటలను మార్కెట్లోకి తీసుకు పోవాలన్నా ఈ రోడ్లతో అవస్థలు పడుతున్నామన్నారు. ప్రజా ప్రతి నిధులు, అధికారులు దృష్టి సారించి రోడ్డు నిర్మాణానికి కృషి చెయ్యాలని ఆ గ్రామాలకు చెందిన జనపరెడ్డి వెంకటలక్ష్మి, భూలక్ష్మి, ఓండ్రు నీలమ్మ, చినప్పారావు, సోడబత్తిన రమేష్, జనపరెడ్డి రాజులమ్మ, కిల్లు రాము, జనపరెడ్డి లక్ష్మణరావు, నూకరాజు, గోసమ్మలు కోరారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న చుట్టుగెడ్డ గ్రామస్తులు

ఓటు అడగడానికే వస్తున్నారు

ఓటు వెయ్యండి మీ సమస్యలు ఏమున్నా మేము తీరుస్తామని ఎన్నికల సమయంలో చెపుతారు. మాకు రోడ్డు సదుపాయమే కల్పించలేదు. మా గ్రామానికి రోడ్డు వెయ్యండి లేదంటే ఈ సారి మా గ్రామాలకు ఎవరు వచ్చిన అడ్డుకుంటాం.

తమ గ్రామాలపై చిన్నచూపు చూడకండి. మా గ్రామం పై దయ చూపండి. సమస్యలు పరిష్కరించాలి

ఓండ్రు నీలమ్మ, చుట్టుగెడ్డ గ్రామం

విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు

కొద్దిపాటి వర్షానికి కూడా మట్టిరోడ్డు బురదమయంగా మారుతుంది. ఈ రోడ్డు గుండా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు పడిలేస్తు ఒళ్లంత బురద చేసుకొని వెళ ్ంటారు. పాఠశాల, అంగన్వాడి కేంద్రాలకు వెళ్లాలంటే అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉంది. సంవత్సరాల తరబడి రోడ్డు బాగు చెయ్యండని ఎవరికి చెప్పినా పట్టించుకోలేదు. ఇప్పటికైన మా గ్రామంపై దయ చూపండి.

జనపరెడ్డి భూలక్ష్మి, చుట్టుగెడ్డ గ్రామం

మా గ్రామాలపై జాలి చూపండి

మా గ్రామాలపై జాలి చూపాలి. పాఠశాల, అంగన్వాడి కేంద్రాలకు వెళ్లాలంటే వర్షాలు పడిన సమయంలో నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉంది. ఈ గ్రామానికి రోడ్డు సదుపాయమే లేదు. 65 ఏళ్లు దాటిన తనకు పెన్షన్ కూడా అందించలేదు. వచ్చిన వారందరికీ చెప్పినా ఫలితం లేదు. ఈ గ్రామాలపై చిన్నచూపు వదిలి, మా గ్రామం పై జాలి చూపండి.

ఓండ్రు చిన అప్పారావు, పులిగుమ్మి గ్రామం

సొంతింటి కల నెరవేరేనా ?

▶▶ గత ప్రభుత్వంలో నివాసయోగ్యం లేని చోట లే అవుట్

▶▶ గృహాలు కట్టేందుకు లబ్ధిదారులు అయిష్టత ▶▶ కూటమిపై ఆశలు

నిరుపయోగంగా లే అవుట్

ప్రజాశక్తి -కోటవురట్ల: కూటమి ప్రభుత్వంలోనైనా సొంతింటి కల నెరవేరుతుందా అని మండలంలో అన్నవరం గ్రామంలోని గృహాల లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆనాటి వైసిపి ప్రభుత్వం 1.20 ఎకరాల స్థలాన్ని దాదాపు పాతిక లక్షలతో కొనుగోలు చేసి 52 మంది లబ్ధిదారులకు లే అవుట్ ఏర్పాటు చేసింది. ఈ జగనన్న కాలనీలో నాటి అధికారులు నాయకులు ఒక్క ఇల్లు కూడా నిర్మాణం చేపట్టలేకపోయారు. కొన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినా గ్రామానికి లే అవుట్ సుదూరంగా ఉండటంతో గృహాలు కట్టుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రాలేదు. కేవలం నివాసయోగ్యం కానీ స్థలాన్ని రెవెన్యూ అధికారులు మంజూరు చేయడం వల్లే నిర్మాణాలకు ఎవరూ ఆసక్తి చూపలేదు. ఏర్పాటుచేసిన లేఅవుట్ కు రోడ్లు, కాలనీ నిమిత్తం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు లైను, బోరు బావి,మోటారు అధికారులు ఏర్పాటు చేశారు అవన్నీ ప్రస్తుతం నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఈ స్థలం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా దర్శనమిస్తుంది. ఈ లేఅవుట్ స్థలంలో అత్యధికంగా దళితులకు మంజూరు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం దళితులకు గ్రామంలో సొంత స్థలం లేక గతంలో వారి తల్లిదండ్రులకు మంజూరు చేసిన ఇళ్లలోనే పిల్లలతో ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కాలనీ ఇళ్లకు గ్రామంలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వాళ్లు మరో 68 మంది ఉన్నారు. వీరిలో గతంలో లేఅవుట్ లో మంజూరైన వాళ్లతో పాటు మరికొందరు ఉన్నారు. వీరిలో కేవలం ఇళ్ల స్థలాలు ఉన్నవాళ్లు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇంటి స్థలాలు లేనివాళ్లు దరఖాస్తు చేసుకోలేదు. అధికారులు దరఖాస్తులు తీసుకొని దాదాపు నాలుగు నెలలకు కావస్తున్నా నేటికీ వారికి మంజూరు పత్రాలు అందించలేదు. దీంతో కూటమి ప్రభుత్వంలోనైనా సొంత ఇంటి కల నెరవేరేనా లేక నాటి వైసిపి ప్రభుత్వం మాదిరిగా మొండి చెయ్యి చూపిస్తుందా అంటూ గ్రామస్తులు ఆందోళన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లే అవుట్‌లో వేసిన విద్యుత్ స్తంభాలు

దంపతులకు కౌన్సెలింగ్ చేస్తున్న వైద్యురాలు

ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ: నర్సీపట్నం బిహెచ్ఎపిఎ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్య శిబిరంకు విశేష స్పందన వచ్చింది. డాక్టర్ రాధిక పొట్లూరి, విశాఖపట్నం పూర్ణచందు అపర్ణలు 25 మంది జంటలకు పరీక్షలు నిర్వహించి వారికి సలహాలు, సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేయడం హర్షణీయమని పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిహెచ్ఎంపిఎ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు బొప్పన లక్ష్మణరావు, నర్సీపట్నం డివిజన్ అధ్యక్షులు అచ్చయ్యనాయుడు, గొలుగొండ మండల అధ్యక్షులు వెంకట్రావు, సమాచార ప్రచార కార్యదర్శి సాలాపు శ్రీనివాస్, ఉమ్మడి విశాఖ జిల్లా మహిళా కన్వీనర్ లగుడు వనజాదేవి, అనివిరెడ్డి రమాదేవి, బొప్పన కుమారి, సోమిరెడ్డి శంకర్‌బాబు, రమణ, బాబి, వెంకటరమణ, నాగలక్ష్మీ పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట అల్లూరి పార్కులో మంచినీటి సమస్య తీర్చేందుకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు ఆదివారం బోరు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, గాడి అప్పలనాయుడు, లగుడు సన్నిబాబు, బొలిశెట్టి పాపారావు, పోతల రాజులనాయుడు, లగుడు రాజులనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కథను చెబుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయధికారిణి పి. దమయంతి ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి తల్లిప్రేమ కథను వివరించారు. విద్యార్థులచే నీతికథలు చదివించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి. ప్రభాకర్ విద్యార్థులకు తల్లిదండ్రుల దినోత్సవం ప్రత్యేకతను వివరించారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా కలాం జీవిత చరిత్రను విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వం పంపిణి చేసిన ప్లేట్లు గ్లాసులను ప్లేట్లు గ్లాసులను ప్రధానోపాధ్యాయుడు ఎస్ ప్రభుదాసు ఆదివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తుందని వీటిని విద్యార్థులు ఉపయోగించుకొని బాగా చదువుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ ఎం సుభాకర్ పాల్గొన్నారు.

ఘనంగా పిఎసిఎస్ ఛైర్మన్ల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి -నక్కపల్లి:పనిచేసే కార్యకర్తకు ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందని, నామినేటెడ్ పదవుల్లో సీనియర్లతో పాటు యువకులు కూడా అవకాశం కల్పించామని హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. నక్కపల్లి మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద ఆదివారం పాయకరావుపేట నియోజకవర్గంలో 10 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఛైర్మన్ లు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. హెూంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సీఎం రమేష్, డీసీసిబీ ఛైర్మన్ కోన తాతారావు, డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్నీ బాలాజీ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా హెూం మంత్రి అనిత పిఎసిఎస్ ల ఛైర్మన్ లు, డైరెక్టర్ల లతో ప్రమాణ శ్రీకారం చేయించారు. ఈ సందర్భంగా హెూం మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ, అతి తక్కువ వడ్డీకి రైతుకు రుణాలు ఇవ్వడం, బంగారు ఆభరణాలపై రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు విత్తనాలు,ఎరువులు కూడా సొసైటీల ద్వారా అందే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు రాబోతున్నాయని, రాబోయే 2,3 సంవత్సరాల్లో 30 నుంచి 40 వేల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయని హెూం మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేష్ వెల్లడించారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయని, 200 కంపెనీలు ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం లో 2 లక్షల నుండి రెండున్నర లక్షల కోట్లు పెట్టుబడులు కచ్చితంగా వచ్చే విధంగా ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు కు అవకాశం ఉందన్నారు. కోటవురట్ల మండలంలో ఫుడ్ ప్రోసీసింగ్ యూనిట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి అనిత వెల్లడించారు.డీసీసిబీ ఛైర్మన్ కోన తాతారావు మాట్లాడుతూ,తమలపాకు రైతులు కూడా రుణాలు ఇస్తామన్నారు. ఎకరానికి 8 లక్షల వరకు రుణం పొందవచ్చునని తెలియజేశారు.

మాడుగులలో సన్మానిస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల:మండలంలో ఒమ్మలి వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌గా మందారపు సన్యాసిరావు, డైరెక్టర్లుగా చామంతుల రామేశ్వర నరసింహారావు, దరిమిశెట్టి సీతారామ్ ఆదివారం శాసనసభ్యులు బండారు సత్యనారాయణ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, పెద్దేరు జలాశయ ఛైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, గ్రామ సర్పంచులు సుంకరి సింహాచలం నాయుడు, వడ్డాది చారుమూతి దేవి, ఎల్లపు కొండ అప్పారావు పాల్గొన్నారు.

నక్కపల్లిలో ప్రమాణస్వీకారం చేయిస్తున్న మంత్రి అనిత

పాయకరావుపేట:పాయకరావుపేట పిఎసిఎస్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత క్యాంపు కార్యాలయం వద్ద ఘనంగా జరిగింది. హెూం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సిఎం రమేష్ ముఖ్య అతిథిధులుగా హాజరై కమిటీ ఛైర్మన్ దేవవరపు రాజుబాబు, డైరెక్టర్లు కూలి నానాజీ, కట్టా నూకరత్నంలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేష్ , పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ గెడ్డం బుజ్జి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చింతలపు ప్రదీప్ (పద్దు), టౌన్ ప్రెసిడెంట్ యాళ్ల వరహాలబాబు, అరట్లకోట టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు కట్టా శ్రీను, పాయకరావుపేట పిఎసిఎస్ సిఇఓ పినపాత్రుని నాగ భూషణం పాల్గొన్నారు.

ఆలయంలో షూటింగ్ బృందం

నర్సీపట్నంలో సినిమా షూటింగ్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: చంద్ర హర్షిని మూవీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న త్యాగ అని సినిమా షూటింగ్ నర్సీపట్నం ప్రాంతంలో బలిఘట్టం మెట్టపాలెం తదితర ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించారు. ముందుగా డి.ఎర్రవరం గ్రామంలో నల్ల కొండమ్మ దేవాలయం వద్ద ఈ చలనచిత్రం ప్రారంభించడానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ మాజీ ఎంపిటిసి చిత్ర ప్రధాన పాత్రధారులు ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు(బుజ్జి) మీడియాతో మాట్లాడుతూ ప్రధానంగా రైతులకు జరుగుతున్న అన్యాయంపై పూర్తి కథ ఉంటుందని, చంద్ర హర్షిని మూవీస్ బ్యానర్ పై జాగా అను చిత్రం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. రెండు రోజులు నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా భూమి సమస్యలపై రైతుల ఇబ్బందులను, జరిగే యదార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం నిర్మించడం జరుగుతుందన్నారు. డైరెక్టర్ గా వైయస్ రెడ్డి (బుజ్జి), డిఓపిగా రాజు కేసన్న, కథానాయకులు ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు (బుజ్జి), సాయి గణేష్, లవ కుమార్, వెంకట పవన్ కుమార్, నాగార్జున చిత్ర బృందం పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న మంత్రి అనిత

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద కోటవురట్ల మండలం బోడపాలెం గ్రామానికి చెందిన సుర్ల రాజేష్‌కు 5 లక్షల 20వేల రూపాయలు సీఎం రీలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం హెూం మంత్రి వంగలపూడి అనిత అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, కోటవురట్ల మండల పార్టీ అధ్యక్షులు లింగన్ననాయుడు, మండల పార్టీ అధ్యక్షులు అధ్యక్షులు జానకి శ్రీను, కోటవురట్ల పిఎసిఎస్ ఛైర్మన్ జానర్ధన్ రావు పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామంలో జాతరలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం శ్రీ సిద్యంధ్ర యోగి నాట్యాలయం చిన్నారులచే నిర్వహించిన కోలాటం, జానపద నృత్యాలు అలరించాయి. మహా గణపతి, కొండలలో నెలకొన్న, భావములోన, జాతిశ్వరం, ముకుంద ముకుంద, ప్రాణావాలయం, ఐగిరినందీని, మొక్కజొన్న తోటలో, రాజాం కొండ గీతాలకు ఆకాంక్ష, హాసిని, దీక్ష, భవ్య, రాణి, సంజన, మనవిత, నవ్య ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పరిపాలనాధికారి రమేష్‌రెడ్డి పర్యవేక్షించారు.

'నవోదయ దరఖాస్తుల గడువు పెంచాలి'

ప్రజాశక్తి-మధురవాడ : జవహర్ నవోదయ విద్యాలయం 5వ తరగతి ప్రవేశాల గడువును పెంచాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రితో పాటు, నవోదయ విద్యాలయ సంస్థ ప్రధాన కార్యాలయానికి లేఖలు రాసినట్టు చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం తెలిపారు. విశాఖ జిల్లాలో గత ఏడాది 9088 మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, ఈ నెల 29వ తేదీతో గడువు ముగుస్తున్నా ఈ ఏడాది ఇప్పటివరకు 2355 మంది మాత్రమే దరఖాస్తులు చేశారని తెలిపారు. దీనిపై తల్లిదండ్రులకు అవగాహన పెంచాల్సిన బాధ్యత విద్యా శాఖపై ఉందని తెలిపారు. మారుమూల గ్రామాల్లో సాంకేతిక లోపం కూడా ఉంటుందని పేర్కొన్నారు.

వైసిపి హయాంలోనే నకిలీ మద్యం

రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి హయాంలో నకిలీ మద్యం విక్రయించారని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైసిపి పాలనలో పది లక్షల కోట్ల అప్పులు చేశారని చెప్పారు. విశాఖకి వచ్చిన లూలు సంస్థను తరిమేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రావడంతో, పదిలక్షల కోట్లు పెట్టుబడులు,పది లక్షలు ఉపాధి అవకాశాలు వస్తున్నాయని, హైదరాబాద్ ఎలా అభివృద్ధి చెందిందో అలాగే చేస్తున్నామన్నారు. రెవెన్యూ సమస్యలు తీర్చేలా ఒక మంత్రి వర్గ ఉపసంఘం పనిచేస్తోందన్నారు. భూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సోమవారం విశాఖ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హుద్‌హుద్ సమయంలో చంద్రబాబు చేసిన సేవను విశాఖ ఉత్తరాంధ్ర వాసులు మర్చిపోలేదని చెప్పారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ వచ్చే ఏడాది పూర్తి చేస్తామని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో అర్సిలర్ మిట్టల్ ఉక్కు పరిశ్రమ తీసుకొస్తున్నారన్నారు.లోకేష్ నాయకత్వంలో టివిఎస్,కాంటిజెంట్ తో పాటు మరో రెండు కంపెనీలు వస్తున్నాయన్నారు. శాసనమండలి మాజీ సభ్యులు దువ్వారపు రామారావు మాట్లాడుతూ అన్ని ప్రాంతాల అభివద్ధి ఎన్‌డిఎ అజెండా అన్నారు. సమావేశంలో రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్, జిల్లా టిడిపి అధ్యక్షులు గండి బాబ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు,రాష్ట్ర కార్యదర్శి లోడగల కృష్ణ పాల్గొన్నారు

పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి -తగరపువలస : పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని చిట్టివలస జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం దొడ్డి ఆదినారాయణ విద్యార్థులకు సూచించారు. ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఇదే హైస్కూల్‌లో ఆదివారం జరిగిన ఎన్‌ఎంఎంఎస్ ఉచిత శిక్షణా తరగతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో చదవాలని కోరారు. సొసైటీ గౌరవాధ్యక్షులు గంటాన మోహనరావు మాట్లాడుతూ, బాగా కష్ట పడి చదివి ప్రథమ స్థానంలో నిలిస్తే జిల్లా కలెక్టర్‌తో సన్మానం చేయిస్తామన్నారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి అప్పారావు, ఉపాధ్యాయులు జివి.అప్పారావు, దుష్యంత్, ఎల్ఎ.శ్రీనివాస్, చిన్నారావు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివకుమార్, రిటైర్డ్ హెచ్‌ఎం జి.సత్యనారాయణ పాల్గొన్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు.

హెపటైటిస్‌పై అవగాహన అవసరం

'ప్రజాశక్తి'తో డాక్టర్ చలపతిరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హెపటైటిస్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని విశాఖలోని కిమ్స్ హాస్పిటల్స్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం చీఫ్ కన్సల్టెంట్, ఇంటర్వెన్షనల్ ఎండోస్కోపీ, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రముఖులు డాక్టర్ చలపతిరావు ఆచంట అన్నారు. సోమవారం అంతర్జాతీయ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ వ్యాధిపై ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

ఈ వ్యాధి ప్రబలడానికిగల కారణాలేంటి ?

విశాఖ నగర పరిసర ప్రాంత ప్రజలు ఆధునిక జీవనశైలికి అలవాటు పడుతున్నారు. కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతోంది. వర్షాకాలంలో ఈ వ్యాధి అధికంగా ప్రబలే అవకాశముంది. హెపటైటిస్ బి, సి ప్రధానంగా రక్తమార్గం ద్వారా వ్యాపిస్తాయి. అసురక్షిత ఇంజక్షన్లు, రక్త మార్పిడి, టాటూలు, అసురక్షిత శృంగార సంబంధాల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ప్రసవ సమయంలో తల్లి ద్వారా శిశువుకూ వ్యాపించొచ్చు. హెపటైటిస్ ఎ, ఇ మల మార్గం ద్వారా వ్యాపిస్తుంది.

వ్యాధి లక్షణాలేంటి ?

తీవ్ర హెపటైటిస్ ఉన్నవారికి పసుపు తేమ (జాండిస్), అలసట, వాంతులు కలుగుతాయి. మహిళల మూత్రంలో తేడాలు కనిపిస్తాయి. హెపటైటిస్ బి, సిని చాలాసార్లు గుర్తించలేం. కాలేయానికి తీవ్ర నష్టం జరిగిన తర్వాత మాత్రమే గుర్తించగలం. దీర్ఘకాలిక హెపటైటిస్ కాలక్రమమైన సిరోసిస్, కాలేయ వైఫల్యం, కాలేయ కేన్సర్లకు దారితీయొచ్చు. ప్రస్తుతం ఈ వ్యాధిపై అవగాహన కొరవడుతోంది.

నివారణ మార్గాలేంటి ?

హెపటైటిస్ బి నివారణకు టీకాలు ఉన్నాయి. సురక్షిత శృంగార సంబంధాలు, ఉత్తమ ఇంజక్షన్ పద్ధతులు, పరిశుభ్రమైన నీరు, ఆహార వినియోగం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, బరువును నియంత్రించడం కాలేయ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం. 'హెపటైటిస్ అవరోధాలను తొలగిద్దాం' థీమ్‌తో ఈ ఏడాది ముందుకు వెళుతున్నాం.